# నైజం

సుదంర్రావయ్య అదృష్టవంతుడు . ఇద్దరాడపిల్లలికి పెళ్ళిళ్లు చేసేశాడు. కొడుకుల్దిరూ మాంచి పొజిషన్లో ఉన్నారు. ఆ వయసులో అంతకాన్న ఇంకేం కావాలి ? అతడి గురించి పరిచయస్థులంతా అనుకునే మాటలివి. ఆ మాటల్లో నిజం ఎంతయినా ఉంది.

సుందర్రావయ్య సర్వీసులో ఉండగానే ఆడపిల్లలిద్దరికీ తన శక్తిమేర మంచి సంబంధాలే చేసేడు. కొడుకు ల్దిరికీ పరిచయస్థుల కాళ్ళూ, గడ్డాలు పుచ్చుకుని ఉద్యోగాలు వేయించాడు. ఆడపిల్లలు కాపురాలకూ, మగపిల్లలు ఉద్యోగ రీత్యా వేరే ఊళ్ళకి వెళ్లగా ఇక మిగిలింది సుందర్రావయ్య అతడి భార్యాన్నూ, ఆఫీసువారిచ్చిన అప్పుతో కట్టిన ఇంటి అయిదు గదుల్లో రెండు మాత్రం తనకోసం ఉంచుకుని మిగిలిన మూడు గదుల్ని అద్దెకిచ్చాడు. రిటైర్మెంటు తరువాత జీవితం సాఫీగా , హాపీగా జరిగిపోవడానికి కావలిసని ఏర్పాట్లు అన్నీ చేసుకున్నాడు. దాన్ని అదృష్టం అంటారో, సమర్ధత అంటారో గాని ఆయన ఆశించినట్లుగానే ఉద్యోగ విరమణ తరువాత జీవితం సాఫీగా నడిచిపోతోంది. నెల నెలా అద్దె డబ్బులు, ఫించను, బాంకు వడ్డీ- అన్నీ కలిపి అవసరానికి మించి వస్తున్నాయ్. సుందర్రావయ్య డబ్బుని వృథాగా తగలేసే రకం కాదు గాని, అలా అని చెప్పి పైసా పైసా కూడబెట్టి కొడుకులికి ఇవ్వాలనే ఉద్దేశం ఉన్నట్లుగా కూడా తోచదు.

ప్రతి పండుక్కి పిల్లలు నలుగుర్నీ రమ్మని ఇరవై రోజులు ముందుగానే ఉత్తరాలు రాస్తాడు. ఉత్తరాలు పోస్టు డబ్బాలో వేసిన రోజు నుంచి, ఎవరు ఎప్పుడొస్తారు ? ఎన్నాళ్ళుంటారు. వాళ్ళున్న నాల్రోజులు ఏయే పిండివంటలు చెయ్యాలి ? ఎవరికెంతెంత ఏ రూపంలో ముట్టచెప్పాలి – తర్జన భర్జనల్లో సుందర్రావయ్య, అతని భార్య నాంచారమ్మ కాలం గడుపుతారు. తీరా పండుగ ఇంకో రెండు రోజులుందనగా ఆడపిల్లలిద్దరూ పిల్లల్ని చేత్తో పుచ్చుకుని చెరో వైపునుంచి వస్తారు. మగపిల్లలు రారు. తీరికలేదని పండుగ వెళ్ళిపోయాక తీరిగ్గా కార్డు రాసి పడేస్తారు.

మొదట్నించి సుందర్రావయ్యకి ఆడపిల్లలంటే అభిమానం ఎక్కువ . వాళ్ళకి బాగా ముట్టచెప్తాడు. కొడుకు లిద్దరూ రాకపోవటానికి ఇదే కారణం అని సుందర్రావయ్యకు తెలుసు. అయినా వాళ్ళ మాటని లక్ష్యపెట్టడు. ప్రతి పండక్కి కూతుళ్ళిద్దరూ పిల్లలతో సహా రావాల్సిందే . వాళ్ళున్న ఆ వారం పదిరోజులూ ఇల్లు పిల్లల అల్లరితో నిప్పంటుకున్న దీపావళి దుకాణంలాగా పేలిపోవాల్సిందే. ఆ తరువాత మళ్ళీ భయంకరమైన నిశ్శబ్దం...పోస్టుమాన్ తేబోయే ఉత్తరాల కోసం, తెలుగు కాలెండర్లో రాబోయే పండగలకోసం ఎదరుచూడటం....పిల్లలు కూడా లేని వాళ్ళకి వృద్ధాప్యం ఎంత నరకమో కదా అనుకుంటుంటాడు సుందర్రావయ్య.

వినాయక చవితి ఇంకా నెల రోజులుందనగానే నలుగరు పిల్లల్ని పండక్కి రమ్మంటూ అలవాటు ప్రకారం ఉత్తరాలు రాసి పడేశాడు. ఆడపిల్ల లిద్దరూ నాలుగురోజులు ముందుగానే వాళ్ళ పిల్లలతో సహా వచ్చి వాలేరు. కొడుకు లిద్దరూ రావటంలేదంటూ ఉత్తరాలు రాసి, పడేశారు. తెల్లవారితే పండగనగా సుందర్రావయ్య వాళ్ళు రాసిన ఉత్తరాలు చదువుకుని ఇంతెత్తున మండిపడ్డాడు.

పెద్దాడికేమో ఆఫీసు పరీక్షలటా. రెండో వాడికి క్రికెట్ మాచ్ ఆట. వెధవసాకులూ వీళ్ళూన్నూ. అయినా పండగనాడు పరీక్ష పెట్టే ఆ నాపవెధవెవడో ? పోనీ వీడు రావచ్చు గదా! అయ్యో నాన్న నెల రోజులు ముందు రాసేడు . ఒక్కసారి చూసొద్దాం ...నీకన్నా నాకన్నా వాడికి ఆ దిక్కుమాలిన మాచ్ ఎక్కువయింది. అంతేనే అంతే ! నాకా ఫించనూ, ఈ కొంపా ఉన్నాయి కాబట్టి బతికిపోయాం. ఈ దరిద్రులు మనకి అన్నం కూడా పెట్టేవాళ్ళు కారు ....'

సుందర్రావయ్య కోపానికి నాంచారమ్మ కళ్ళొత్తుకుంటూ అడ్డుపడింది – ' పండగపూట తిట్టకండి . దూరానెనక్కడో వున్నారు. పిచ్చివెధవలూ ' అంటూ.

ఆ మర్నాటి ఉదయం ,,,,చవితి పండుగ .

మనవలు , మనవారాళ్లు లోపల పూజ చేసుకుంటున్నారు. నాంచారమ్మ వంటగదిలో తలమునలకలుగా ఉండటంతో పెద్ద కూతురు శారద తల్లికి సాయం చేస్తోంది. సుందర్రావయ్య వసారాలో తన పడక్కుర్చీలో విశ్రాంతిగా కూర్చునుండగా, ఆయనక్కాస్త దూరంలో రెండో పిల్ల రుక్మిణీ పూలు కడుతూ మాటి మాటికి వీధివైపు చూడటంలోని ఆమె ఆంతర్యాన్ని గమనించి ' రాఘవరావు ఇహ రాదల్లే ఉంది ' అన్నారు కాస్త నొచ్చుకుంటున్నట్లు.

ఆ మాటకే ఆమె తలెత్తి తండ్రి వంక చూసి అదోలాగా నవ్వింది. అలా అందరూ నవ్వేరు. గరళాన్ని దాచిన శంకరుడో , ప్రపంచ లీలని అర్ధం చేసుకున్న శంకరాచార్యుల వారో తప్ప . ఆ నవ్వుతో పాటుగా ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగినాయి. ఆయన కంగారుపడి బుజ్జగించి అనునయంగా అడగ్గా ' ఎందుకులెండి నాన్నా – ఏం అనుకుని ఏం లాభం ? మమ్మల్ని కన్నారే గాని మా అదృష్టాన్ని కాదుగా. చూసే వాళ్ళందరికీ ఉద్యోగస్థుడి పెళ్ళానని కన్నెర్ర, కాని నా అవస్థలు ఎవళ్ళకి తెలుస్తాయి ? అదేం మనిషోగాని ఎంతసేపూ ఆఫీసు, స్నేహితులు రోడ్లు తప్పించి ఇంటి ధ్యాసే పట్టదు. పొద్దున్న ఆఫీసుకంటూ వెళ్ళిన మనిషి మళ్ళీ ఏ అర్ధరాత్రికో రావటం. అడిగితే రాద్ధాంతం. మగపనికి , ఆడపనికి నేనే చావాలి గదా ? వండటం, వార్చటం, తప్పించి ఓ మాటా మంచి, ముద్దూ ముచ్చట తెలీదు గదా ! ఛ ఛ విరక్తిగా వుంటోంది. అయినా ఈ సంబంధం ఎక్కడ దొరికింది నాన్నా నీకు ! ”

ఆమె మాటలకి సుందరావయ్య నివ్వెరపోయాడు. వినటానికి చిన్నవిషయంగా అనిపించవచ్చు. అనుభవించేవాడికి కాలి నొప్పి కాడా కాన్సర్ వ్యాధిలా అనిపిస్తుంది. ఇంత బాధని తనలో దాచుకుందా ! అసలే ఆయన సున్నిత మనస్కుడేమో ఆలోచనల్లకి ఆనకట్ట వెయ్యాలన్న ఉద్దేశంతో మౌనంగా కుర్చీలోంచి లేచి వంటగది వైపుగా వెళ్ళారు. పురోహితుడు చెప్తున్న కథకన్నా , పెద్ద కూతురు శారద తల్లితో చెప్తున్న మాటలు స్పష్టంగా వినిపిస్తుండగా ఆయన తలుపు పక్కగా నిల్చుని వినసాగాడు.

' కానీ ……. ఓ విషయమే అమ్మా! ఎన్నన్నా చెప్పు మగాడు ఇంటిపట్టున ఉంటే నాకు వొళ్ళు మండిపోతుందనుకో . అదేం ఆఫీసో గాని. పదకొండుగ్గంటలగ్గాని వెళ్ళరు. వెళ్ళి నాలుగ్గంటలకల్లా తయ్యారు. అక్కణ్ణించి లుంగీ ఒకటి కట్టి కొంపంతా పచ్చార్లు. అదేం చేశావ్. ఇదేం చేశావ్ అంటూ యక్షప్రశ్నలు. కాసేపు అలా వెళ్ళిరండి అంటే టైం వేస్టు. మగాడు మగాడులా ఉండాలే గాని, ఆడంగి వెధవలా ప్రవర్తిస్తే అరికాలి మంట నెత్తి కెక్కుతుంది. చక్కగా రుక్మిణీ మొగుడ్ని చూడు – ఎంతమంది ఫ్రెండ్సో – ఎప్పుడూ ఎంత బిజీగా ఉంటాడో ! అలా ఉంటే ఎంత దర్జాగా వుంటుంది.

ఆయన మళ్ళీ తిరిగొచ్చి వాలు కుర్చీలో కూర్చున్నాడు. రుక్మిణీ లోని కెళ్లిపోయింది. ఆయనకి బాధ తగ్గినట్వొచ్చింది. ఇద్దరు కూతుళ్ళ వ్యధకి అర్ధంలేదనిపించింది. ఇవన్నీ ఇంకోళ్ళతో పోల్చుకోవటంచేత కలిగే పరిణామాలు . ఆడది పోల్చుకుంటుంది. మగవాడు పోటీ పడతాడు. అది వాళ్ళ స్వభావాలు. ' ఈ సంబంధం ఎక్కడ దొరికింది నాన్నా ' అనడిగింది. ' రేపు ' నువ్వే నా జీవితం నాశనం

చేశావ్ నాన్నా ’ అని కూడా అనగల్దు. అనటానికేం ఉంది ? ఏవైనా అనొచ్చు. కాని ఆ పెళ్ళి చేయటానకి త నెంత తలికిందులయ్యేడో వాళ్ళకేం తెలుసు ? వచ్చిన ప్రతిసారీ ఇలా పోల్చుకుని మనసుకి పొగ పెట్టి బాధపడిపోయి రాళ్ళు రువ్వినట్లు మాటలు విసిరేస్తే ఆ గాయాలు మానటానికి ఎంతకాలం పడుతుంది ?

సుందర్రావయ్య ఆలోచనలు మొదటిసారిగా మరో మార్గాన పయనించసాగాయి. పైగా రాత్రి కొడుకు లిద్దరూ పండక్కి రాలేదని మండిపడ్డ ఆయనే – ‘ రెండు రాళ్ళ దెబ్బలు తప్పినాయి ’ గదాని సంతోషించేస్తుండగా …… భోజనాలకి పిలుపొచ్చింది.

------- అయ్యిపోయింది -------